ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
ఆదివారం 15 సెప్టెంబరు 2024




దేవాదుల సొరంగం

మన మేధస్సు.. అద్భుతం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనలు, భారీ ప్రాజెక్టుల వరకు అన్నింటిలోనూ ఇంజనీర్లే కీలకం
- దేవాదుల ప్రాజెక్టులో 49.6కి.మీ.ల టన్నెల్ ఓ రికార్డు
- 506 మీటర్లపైకి కొండపోచమ్మ వరకు నీటిని లిఫ్ట్ చేసేలా కాళేశ్వరం డిజైన్
- చెక్కుచెదరని నిజాంకాలం నాటి ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు
- మేడారం జంపన్నవాగుపై 37రోజుల్లో వంతెన నిర్మాణం మరో రికార్డు
- ఇప్పటికీ అంతుచిక్కని కాకతీయుల నాటి కళా నైపుణ్యం



ప్రపంచ వారసత్వ సంపదగా వెలుగొందుతున్న రామప్ప దేవాలయం




నేటికీ చెక్కుచెదరని ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు

5 నేడు ఇంజనీర్స్ డే

Sunday Special

కాకతీయుల కాలమైనా.. ప్రస్తుతమైనా.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్నో అద్భుత కట్టడాలకు నిలయం. గొలుసు కట్టు చెరువుల నుంచి నీటిని ఎత్తిపోసే నేటి తరం ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. వీటికి తోడు ఎప్పటికీ అంతుచిక్కని ఎన్నో రహస్యాల సమాహారమైన ఆలయాలు ఉన్నాయి. ఓ వైపు భూగర్భంలో అనకొండల్లా కిలోమీటర్ల కొద్ది సాగిపోయే సొరంగాలు.. మరోవైపు శిల్పకళా శోభిత ఆలయాల కట్టడాలను చూస్తే కళ్లు చెదురుతాయి. ఆహా.. ఈ ఇంజనీరింగ్ నైపుణ్యం అమోఘం అనడం ఖాయం. కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిస్తే.. దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్‌తో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహాద్భుతంగా అభివర్ణిస్తున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలవటం నాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. ఇలా ఎన్నో విశిష్ట కట్టడాల సమాహారమైన ఓరుగల్లు నిర్మాణాల్లో ఇంజనీరింగ్ నిపుణుల నైపుణ్యం చెక్కుచెదరనిది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



కాళేశ్వరం ప్రాజెక్టు

లైంగికదాడి కేసు నమోదు

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 14: వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భూపాలపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడిపై లైంగికదాడి కేసు నమోదైంది. ఈ మేరకు ములుగు సీఐ శంకర్, వెంకటాపూర్ ఎస్సై సతీష్ శనివారం తెలిపారు. భూపాలపల్లి మండలంలోని ఓగ్రామంలో ఒంటరిగా నిద్రిస్తున్న 55ఏళ్ల మహిళపై ఇదే గ్రామంలో జులాయిగా తిరిగే 25ఏళ్ల యువకుడు ఈనెల 12న అర్ధరాత్రి లైంగికదాడి చేసినట్లు తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపి ఆ యువకుడిపై బీఎన్ఎస్ 63,333,351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆదివాసీల నిరసన ర్యాలీ



వెంకటాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 14: ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ నవనిర్మాణసేన ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి మాట్లాడుతూ ఆదివాసీ గూడాల్లో మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. మహిళపై దాడి జరిగిన వారంరోజుల తర్వాత జైనూరులో ఘర్షణ జరిగితే ప్రభుత్వం అమాయక ఆదివాసీలపై కేసు నమోదు చేశారని విమర్శించారు. ఆదివాసీ మహిళలకు జరిగిన అన్యాయానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళపై లైంగికదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మోడెం నాగరాజు, సురేందర్, నారాయణమ్మ, ఎట్టి ఝాన్సీ మహేష్, రాజేష్, మడకం రవి తదితరలుఉ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రీడలకు విద్యార్థుల ఎంపిక



సౌత్‌జోన్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 14: భూపాలపల్లి పట్టణంలోని మైనారిటీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు సౌత్‌జోన్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శనివారం తెలిపారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రాజు రన్నింగ్ పోటీలో, సాయి లాంగ్‌జంప్‌లో, సమీరుద్దీన్, ఫయాజ్ రన్నింగ్, డిస్కస్‌త్రోలో ప్రతిభ కనబరిచారని వివరించారు. వీరంతా ఈ నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్ క్రీడామైదానంలో జరిగే సౌత్‌జోన్ క్రీ డల్లో పాల్గొననున్నారని తెలిపారు. సౌత్‌జోన్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, పీడీ గౌస్ అహ్మద్, అధ్యపకులు అభినందించారు.

సింగరేణి కార్మికులకు గాయాలు

కాకతీయఖని, సెప్టెంబరు 14: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5వ, 8వ గనిలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. కార్మికులు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కేటీకే-5వ గని 2సీమ్ 17డీప్ ఆఫ్ 9 లెవల్ వద్ద శ్రీకాంత్ అనే బదిలీ వర్కర్ మొదటి షిఫ్టులో సపోర్టుమన్‌తో కలిసి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో రూఫ్‌బోల్ట్ హైట్ సరిపోకపోవడంతో అక్కడ పుషర్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌ను సర్దార్ పిలిచి డికింగ్ చేయాలని సూచించాడు. శ్రీకాంత్ డికింగ్ చేస్తున్న క్రమంలో రూఫ్‌బోల్ట్ రాడ్ విరిగి శ్రీకాంత్ కుడిచేయి మధ్య వేలుకు తగిలింది. తోటి కార్మికులు అతడిని ఏరియా సింగరేణి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వెలికి ఫ్రాక్చర్ అయిందని నిర్ధారించినట్లు తోటి కార్మికులు తెలిపారు. అలాగే కేటీకే-8వ గనిలో మొదటి షిఫ్టులో పనిచేస్తున్న బదిలీ వర్కర్ పొన్నం సునీల్‌కు ప్రమాదం జరిగి గాయాలయ్యాయని కార్మికులు చెబుతున్నారు. 8వ గని 2 సీమ్ బ్యాంకెట్ వద్ద హాలర్ స్టీల్ రోప్‌ను సునీల్ కోస్తుండగా దాని ముక్క ఒకటి వచ్చి అతడి కుడికాలికి గుచ్చుకుంది. దీంతో అతడిని సింగరేణి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్లు తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన విషయమై అధికారులను అడగ్గా వాస్తవమేనన్నారు.

భయం... భయం

బెంబేలెత్తిస్తున్న శునకాలు



- కుక్కల దాడుల్లో 45 రోజుల్లో 75 మందికి గాయాలు
- చిట్యాల మండలంలో తీవ్ర సమస్య
- పట్టించుకోని అధికారులు

చిట్యాల, సెప్టెంబరు 14: పల్లె ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. బయటకు రావాలంటేనే భయంతో వణికి పోతున్నారు. వీధి కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో 45 రోజుల్లో 75 మంది గాయపడ్డారు. కుక్కల దాడిలో గాయపడి చిట్యాల సామాజిక ఆస్పత్రిలో 62 మంది, ఒడితల పీహెచ్‌సీలో 13 మంది చికిత్స తీసుకున్నారు. మండల కేంద్రంలోని పలు వీధుల్లో నాలుగు రోజుల క్రితం ఒకే కుక్క 10 మందిని గాయపర్చింది, . కుక్కల దాడిలో గురయ్యేవారు మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రి, ఒడితల పీహెచ్‌సీల్లో ఏఆర్‌వీ (యాంటీ రాబిస్ వ్యాక్సిన్) ఇంజక్షన్‌ను తీసుకుంటున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని భూపాలపల్లి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేస్తుండగా అక్కడి వైద్యులు ఇమ్యునోగ్లోబులిన్ ఇంజక్షన్‌ను ఇస్తున్నారు. మండలంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కుక్కల దాడిలో గాయపడితే యాంటీ రాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని చెబుతున్న అధికారులు.. వాటిని అరికట్టడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. చిట్యాల సీహెచ్‌సీ, ఒడితల పీహెచ్‌సీలో ఏఆర్‌వీ (యాంటీ రాబిస్ వాక్సిన్) అందించినట్లు వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మౌనిక తెలిపారు. కుక్కల బెడదను అరికట్టేందుకు మండలంలోని పంచాయతీ అధికారు లు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బైక్‌పై వెళ్లాలంటేనే గుబులు

ద్విచక్ర వాహనదారులు గ్రామాల్లో ప్రయాణిసున్నారు. కుక్కలు తరుముతుండటంతో అదుపుతప్పి పలువురు గాయపడిన సందర్భాలు ఉన్నాయి. చీకటి పడిన తర్వాత కుక్కలు ఎటువైపు నుంచి దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి..

- గుజనాల రవీందర్, తిరుమలపురం



గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలపై కుక్కలు దాడి చేస్తున్నాయి. గేదెలు, గొర్రెలు, మేకలను సైతం గాయపరుస్తున్నాయి. కుక్కల వల్ల రోడ్డుపై ఒంటరిగా వెళ్లాలంటే భయం వేస్తున్నది. గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని కుక్కలను నివారించాలి.

వెంటనే వైద్యం తీసుకోవాలి: డాక్టర్ మౌనిక, మెడికల్ ఆఫీసర్, ఒడితల పీహెచ్‌సీ



కుక్క కాటుపై నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలి. కుక్క, కోతికాటు విరుగుడుకు సంబంధించిన యాంటీ రాబిస్ వాక్సిన్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. గాయపర్చిన వెంటనే ఆస్పత్రికి రావాలి.



చిట్యాల ప్రధాన రహదారిపై శునకాల గుంపు

కాజీపేట మీదుగా నాగపూర్‌కు 'వందేభారత్'

రేపటి నుంచి రైలు రాకపోకలు

కాజీపేట, సెప్టెంబరు 14: ఈ నెల 16 నుంచి కాజీపేట మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడవనుంది. ఇందుకు రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నాగ్‌పూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (20101) రైలు ఈ నెల 16న నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి కాజీపేట 10.04 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్‌కు 12.15 నిమిషాలకు చేరుకుంటుంది. తిరిగి సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 1 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 3.20 నిమిషాలకు చేరుకుంటుంది. రాత్రి 8.20 నిమిషాలకు నాగ్‌పూర్‌కు చేరుకుంటుంది. ఈ రైలు సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి కోసం గాలింపు



వెంకటయ్య (ఫైల్)

మేడారం, సెప్టెంబరు 14 : మేడారం మహా జాతరలో తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ నేటికీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధులు గాలిస్తూనే ఉన్నారు. అతడి భార్య పోశవ్వ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం జనగామ గ్రామానికి చెందిన జంగిడి వెంకటయ్య 2024 ఫిబ్రవరిలో జరిగిన మేడారం మహా జాతరలో తప్పిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకూ వెంకటయ్య ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలోనే అతడి భార్య, ముగ్గురు కుమారులు, బంధువులు మేడారం, నార్లాపూర్ గ్రామాల్లో వెంకటయ్య కోసం మరోసారి గాలించారు. అయినా వారికి నిరుత్సాహమే ఎదురైంది. నార్లాపూర్ శివారు కాల్వపల్లి క్రాస్ వద్ద అతడి కనిపించాడని స్థానికులు కొందరు తెలుపుతున్నారని, అయినా తమకు దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచూకీ తెలిసిన వారు 8790340768, 9440088715 ఫోన్ నంబర్లపై సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రూ. 25 లక్షల కరెన్సీ నోట్లతో విఘ్నేశ్వరుడి అలంకరణ



ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఎర్రమ్మవాడలో కరెన్సీ నోట్లతో అలంకరించిన వినాయకుడు

ఏటూరునాగారం, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని శివాలయం వీధిలోని ఎర్రమ్మవాడలో కొలువుదీరిన గణనాథుడిని యువజనులు శనివారం కరెన్సీనోట్లతో అలంకరించారు. ఇందుకు రూ. 25 లక్షల నోట్లను వినియోగించారు. ఇండియన్ యూత్ ఆధ్వర్యంలో ఈ మేరకు అలంకరించగా లక్ష్మీగణపతి అవతారంలో విఘ్నేశ్వరుడు దర్శనమిచ్చాడు. రైతులు, వ్యాపారులు, ప్రజల నుంచి రూ. 2000, రూ. 500, 200, 100, 50, 20, 10 కరెన్సీ నోట్లతో వినాయకుడిని, మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

కమ్యూనిస్టుల పోరాటాలతోనే తెలంగాణకు విముక్తి

సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు



మాట్లాడుతున్న తోట మల్లిఖార్జునరావు

వాజేడు, సెప్టెంబరు 14: కమ్యూనిస్టు పార్టీల వీరోచిత పోరాటాల ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కలిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు గుర్తుచేశారు. మండలంలోని ధర్మవరంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆచంటి ప్రసాద్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో మల్లికార్జునరావు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం ఆగస్టు 15న వస్తే తెలంగాణకు మాత్రం రాలేదన్నారు. నిజాం నవాబు పాలనలో దేశ్‌ముఖ్‌లు, జమీందార్లు, జాగీరుదారులు అనేక దౌర్జన్యాలు, దాడులు, మానభంగాలు చేశారని, ప్రజలతో వెట్టిచాకిరీ చేయిస్తూ నరక యాతన చూపిస్తున్న రోజుల్లో కమ్యూనిస్టులు వారికి వ్యతిరేకంగా పోరాడరని తెలిపారు. వేల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. ఆనాటి పోరాటాలకు స్ఫూర్తిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రతి గ్రామంలో నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై ఉద్యమించాలన్నారు. వరదల వల్ల నష్టపోయిన రైతులను, పేద ప్రజలకు ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. సమావేశంలో నల్లెబోయిన రవీందర్, గార రాంబాబు, కొప్పుల శ్రీనివాసరావు, భట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 14: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లాస్థాయి యువజనోత్సవాలు, పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి తుల రవి శనివారం ఒక ప్రక టనలో తెలిపారు. ఈపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన బృందం జనవరి 12 నుంచి 16 వరకు కర్ణాటకలో జరిగే జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొననున్నట్లు వివరించారు. 15నుంచి 29 ఏళ్లలోపు యువతీ యువకులు, కళా కా రులు ఈనెల 20లోగా ములుగులోని డీవైఎస్‌వో కార్యాల యంలో దరఖాస్తు చేయాలని, మరిన్ని వివరాలకు 7330326241, 9849011113 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు పచ్చజెండా

- సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- డీన్ మనోహర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 14: కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు పీజీ అభ్యర్థులంతా ఇక నుంచి తప్పనిసరిగా యూజీసీ సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణను తప్పనిసరి చేయనుంది. దేశవ్యాప్తంగా న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పీహెచ్‌డీ అడ్మిషన్లకు జాతీయ అత్యున్నత సంస్థ నిర్వహించే నెట్ పరీక్షలు తప్పనిసరి చేసింది. దేశవ్యాప్తంగా యూజీసీ గుర్తింపు పొందిన వర్సిటీలన్నింటికీ మార్గదర్శకాలను రూపొందించింది. తమ ఆదేశాల మేరకు అన్ని వర్సిటీలు పీహెచ్‌డీ అడ్మిషన్లలో ప్రత్యేక ప్రవేశ పరీక్షలు రద్దు చేసి సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, నెట్ ఉత్తీర్ణత మేరకు సీట్లు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ మార్గదర్శకాల నేపథ్యంలో వర్సిటీ ఉన్నతాధికారులు విధి విధానాలు రూపొందించేందుకు కేయూ సోషల్‌సైన్స్ డీన్ తాళ్లపల్లి మనోహర్, ఛైర్మన్‌గా జియాలజీ విభాగాధిపతి మల్లికార్జున్‌రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం డీన్ ఎం సదానందం, అకాడమిక్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కోలా శంకర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. కమిటీ ఇప్పటికే యూజీసీ నిబంధనలు ఏమీ చెబుతున్నాయి. మార్గదర్శకాలు ఏవిధంగా రూపొందించాలనే అంశంపై చర్చించింది.

పీహెచ్‌డీ ఎంట్రెన్స్ రద్దు

కేయూ ప్రత్యేకంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఎలాంటి ఎంట్రెన్స్ నిర్వహించదు. జాతీయ స్థాయి జేఆర్ఎఫ్ అభ్యర్థులకు అన్ని విభాగాల్లో మొట్టమొదటి ప్రాధాన్యత కల్పించి అడ్మిషన్లు కల్పిస్తారు. జేఆర్ఎఫ్ తర్వాత నెట్ ఉత్తీర్ణతలో వచ్చిన మెరిట్ మేరకు అడ్మిషన్లు కల్పిస్తారు. ఏడాదికి రెండు దఫాలుగా జాతీయస్థాయిలో నెట్ పరీక్షలు జరుగుతాయి. నెట్ పరీక్షల ఫలితాలు రాగానే అర్హులైన అభ్యర్థులు నేరుగా దరఖాస్తులు చేసుకుంటే అడ్మిషన్లు కల్పించే వీలుంది. అభ్యర్థులు ప్రత్యేకంగా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌కు ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. నెట్ పాసైన వెంటనే అడ్మిషన్లు పొందవచ్చు.

జేఆర్ఎఫ్, నెట్‌కు కుస్తీ పట్టాల్సిందే..

జాతీయస్థాయిలో ప్రతీ సబ్జెక్టులో నెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంగ్లీష్, హిందీ భాషల్లో రెండు పేపర్లుంటాయి. మొదటి పేపర్ జనరల్ నాలెడ్జ్, కంప్యూటర్ పరిజ్ఞానం, ప్రాథమిక గణిత సామర్థ్యాలు, లోక పరిజ్ఞాన అంశాలుంటాయి. మొదటి పేపర్‌లో అర్హులైన అభ్యర్థుల రెండో పేపర్‌ను వాల్యూయేషన్ చేస్తారు. రెండో పేపర్ మొత్తం సంబంధిత అభ్యర్థి ఎంచుకున్న అంశంలో ఉంటుంది. సైన్స్ అభ్యర్థులకు సీఎస్ఐఆర్ అని, ఆర్ట్స్, సోషల్ సైన్స్ ఇతర సబ్జెక్టుల అభ్యర్థులందరికీ నెట్ పరీక్షలని పిలుస్తారు. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో ఏడాదికి రెండు దఫాలుగా యూజీసీ సీఎస్ఐఆర్, నెట్ ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. పీజీ ఫైనలియర్‌లో ఉన్న అభ్యర్థులను కూడా నెట్, సీఎస్ఐఆర్ ప్రవేశ పరీక్షలకు అనుమతిస్తారు. జేఆర్ఎఫ్‌కు వయసు పరిమితి విధించారు. నెట్ ఉత్తీర్ణతకు మాత్రం ఎలాంటి వయసు పరిమితి ఉండదు. ఉత్తీర్ణులయ్యే వరకు పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించారు. నెట్ పరీక్షల కోసం కేయూలో ఉచితంగా కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కొత్త వీసీ రాగానే నోటిఫికేషన్

యూజీసీ నిబంధనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం రూపొందించిన విధి విధానాల నోటిఫికేషన్ కొత్త వీసీ రాగానే జారీ కానుంది. యూజీసీ నిబంధనలన్నీ ఉన్నది ఉన్నట్లుగా అడాప్ట్ చేసుకునే అధికారం వీసీకి ఉంది. రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని అన్ని వర్సిటీలకు నూతన వీసీలను నియమిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. వీసీలు రాగానే యూజీసీ పీహెచ్‌డీ అడ్మిషన్లు ప్రక్రియకు అధికారికంగా పచ్చజెండా ఊపుతారని వర్సిటీ అధికార వర్గాలు వెల్లడించాయి.

పురుగుల మందు తాగిన వృద్ధురాలి మృతి

డోర్నకల్, సెప్టెంబరు 14 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్‌లోని లచ్యాతండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. లచ్యాతండాకు చెందిన తేజావత్ బీబు (60) సుభాష్ వీధిలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి లింగంపల్లి రాజేష్ ఇంటిలో పనిచేస్తుంది. ఈనెల 13న రాజేష్ ఇంటిలో రోజువారి పనులు ముగించుకుని తన ఇంటికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం మళ్లీ రాజేష్ ఇంటికి రాగా ఇంట్లో ఉన్న రూ.15 వేలు నగదు పోయిందని, ఆమె తీసిందని ఆవేశంతో రాజేష్, అతడి భార్య అమల బీబుపై చేయి చేసుకున్నారు. మనస్తాపం చెందిన బీబు ఇంటికి వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు రమేష్ బీబును చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ చికిత్స పొందుతూ బీబు మృతి చెందింది. మృతురాలి కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిన్నెల వాగులో గల్లంతైన వ్యక్తి మృతి

బయ్యారం, సెప్టెంబరు 14 : వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నామాల పాడు పంచాయతీ ధర్మాపురానికి చెందిన పూనెం వెంకన్న (45) కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లి వస్తానని భార్య శృతితో చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. అనంతరం ఎంతకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాలు వెతక సాగారు. ఈ క్రమంలోనే గ్రామ సమీపంలోని జిన్నెల వాగు ఒడ్డున వెంకన్నకు సంబంధించిన చెప్పులు, టవల్ కనిపించడంతో ప్రమాదవశాత్తు వెంకన్న వాగులో గల్లంతై ఉంటాడనే అనుమానంతో రెండురోజుల పాటు గజ ఈతగాళ్లతో వెతికించారు. శనివారం వెంకన్న మృతదేహం లభ్యమైంది. మృతురాలి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.



కుడా చైర్మన్ వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

కళాకారులకు గుర్తింపు ఇవ్వాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: హనుమకొండలో ప్రారంభమయ్యే కాళోజీ కళాక్షేత్రంలో కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాసంస్థలకు ఉచితంగా ఇవ్వాలని తెలంగాణ నాటక కళా సమితి నాయకులు, కళాకారులు శనివారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కుడా కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆడిటోరియంలో కళాకారులు మేకప్ చేసుకునేందుకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్, స్టేజీ డెకరేషన్, గ్రీన్‌రూమ్, రిహార్సల్స్ గదులు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, కాకతీయ నాటక కళాపరిషత్ జిల్లా అధ్యక్షుడు రాదారపు సంజీవరెడ్డి, కళాకారులు చక్రపాణి, బాలాజీ, రమేష్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, అశోక్‌కుమార్, బిక్షపతి, శంకర్, గణేశ్‌తో పాటు కళాకారులు పాల్గొన్నారు.

నిమజ్జన వేళ.. మద్యం షాపులు బంద్

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఈనెల 16వ తేదీ ఉదయం 6గంటల నుంచి 17వ తేదీ ఉదయం 6గంటల వరకు మద్యం విక్రయాలు నిలిపివేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా పూర్తి చేసేందుకు మద్యం షాపులు బంద్ చేయాలన్నారు. మద్యం సరఫరా చేసే బార్‌లు, క్లబ్‌లు, హోటళ్లు మూసివేయాలని అంబర్ కిషోర్‌ఝా సూచించారు. ఎవరైనా మద్యం షాపులు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు ఆకాశవాణిలో ఎంపీ కావ్యతో ముఖాముఖి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 14: వరంగల్ ఆకాశవాణి ఎఫ్ఎం బ్యాండ్ 103.5 మెగా హెడ్జ్‌పై ఆదివారం ఉదయం 7.15నిమిషాలకు వరంగల్ ఎంపీ కడియం కావ్యతో ముఖాముఖి కార్యక్రమం ప్రసారం జరుగుతుందని కార్యక్రమ నిర్వాహకులు ఇల్లెందుల రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడియం కావ్య జీవన ప్రయాణంలో అనేక విషయాలు.. అనే అంశంపై ప్రసారం ప్రారంభం అవుతుందని తెలిపారు.

తైక్వాండోలో శశాంక్‌కు కాంస్యం

న్యూశాయంపేట, సెప్టెంబరు 14: తమిళనాడులో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో న్యూశాయంపేటకు చెందిన గుజ్జేటి త్యాగరాజు కుమారుడు శశాంక్ కాంస్య పతకం సాధించాడు. శనివారం టోర్నీ నిర్వాహకుల నుంచి శశాంక్ కాంస్య పతకం అందుకున్నాడు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శశాంక్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ కోచ్ వీ నరసింహ పర్యవేక్షణలో 6 నెలలు శిక్షణ తీసుకున్నాడు.



నిర్వాహకుల నుంచి కాంస్య పతకం తీసుకుంటున్న విద్యార్థి శశాంక్

మన మేధస్సు.. అద్భుతం

- అబ్బురపరిచే కట్టడాలకు నిలయం ఓరుగల్లు
- కాకతీయుల కాలం నుంచి నేటి వరకు ఎన్నో విశిష్ట నిర్మాణాలు
- వంతెనల నుంచి భారీ ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ ఇంజనీర్లే కీలకం
- నేడు ఇంజనీర్స్ డే

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కళ్లు చెదిరే ఎన్నో కట్టడాలకు నెలవు ఉమ్మడి వరంగల్ జిల్లా. కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువుల నుంచి ఈ తరం వారు నిర్మించిన ప్రాజెక్టుల వరకు అన్నిటిలోనూ అద్భుతాలే. అంతేకాదు ప్రపంచాన్ని సైతం అబ్బురపరిచే ఆలయాల నిర్మాణం, దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన టన్నెల్ నిర్మాణంతో పాటు 624 అడుగుల ఎత్తుకు కాళేశ్వర జలాలను తరలించే ఇంజనీరింగ్ డిజైన్‌ను మహా అద్భుతంగా చెబుతున్నారు. మేడారంలోని జంపన్నవాగుపై 37రోజుల వ్యవధిలో నిర్మించిన వంతెనకు కితాబివ్వని వారుండరు. వందేళ్లకు ముందెప్పుడో నిర్మించిన ఇచ్చంపల్లి ప్రాజెక్టు పునాదులు ఇప్పటికి చెక్కు చెదరకుండా నిలవటం ఆనాటి మన ఇంజనీర్ల దూరదృష్టికి నిదర్శనం. అంతేకాదు కాకతీయుల కాలంలో నిర్మించిన అనేక గొలుసుకట్టు చెరువులు, సాండ్ బాక్స్ టెక్నాలజీ ప్రపంచాన్నే అబ్బుర పరిచింది.

అసియాలోనే అతిపెద్ద టన్నెల్

ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరప్రదాయనిగా భావించే దేవాదుల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ అద్భుతంగా చెబుతారు. 2003లోనే మన ఇంజనీర్లు రూపొందించిన దేవాదుల ఎత్తిపోతల పథకానికి అసియాలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా పేరుంది. మూడు దశలుగా విభజించి నిర్మించిన ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏడాదంతా నీటిని ఎత్తిపోసేలా డిజైన్ చేశారు. సుమారు 6లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఈ దేవాదుల ప్రాజెక్టులో భాగంగా మూడవ దశలో టన్నెల్‌ను నిర్మించారు. ఈ అతిపెద్ద సొరంగాన్ని ములుగు జిల్లా జాకారం నుంచి హనుమకొండ జిల్లా దేవన్నపేట వరకు 49.6కిలో మీటర్ల వరకు నిర్మించారు. ఎన్నో అవాంతరాలను ఎదుర్కొంటూ వందలాది మంది ఇంజనీర్ల కృషితో విజయవంతంగా సుదీర్ఘకాలం పాటు టన్నెల్ నిర్మాణం సాగింది. ఈ సొరంగం నుంచి దేవాదుల ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను తరలించనున్నారు. దేవన్నపేట రిజర్వాయర్ వద్ద నిర్మించిన అతిపెద్ద సర్జ్‌పూల్‌ను 25మీటర్ల డయాతో 135మీటర్ల లోతున్న బావితరహాలో నిర్మించగా, 141 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన పంపుహౌస్ కూడా ఓ రికార్డే. ఇంత పెద్ద సొరంగం నిర్మాణాన్ని డిజైన్ చేసిన ఇంజనీర్ల ప్రతిభను ప్రశంసించని వారు లేరు. టన్నెల్ పనులు ఆలస్యమైనా ఇంత పెద్ద సొరంగాన్ని తవ్వి గోదావరి జలాలను తరలించటం సాధారణ విషయం కాదనే చర్చ ఉంది. ఇందులో వినియోగించిన యంత్రాలు విదేశీవే అయినప్పటికి మేదస్సు మాత్రం మన ఇంజనీర్లదే కావడం విశేషం.

ఇచ్చంపల్లి... అచ్చాహై..

నిజాం కాలంలోనే అప్పటి హైదరాబాద్ రాష్ట్రంతో పాటు



మేడారం జంపన్న వాగుపై నిర్మించిన జంట వంతెనలు

మధ్యప్రదేశ్, మహారాష్ట్రల సాగు, తాగు నీరు, విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఇచ్చంపల్లి ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై ఈ భారీ ప్రాజెక్టుకు నిజాం సర్కారు శ్రీకారం చుట్టింది. 1860లోనే ఫ్రెంచ్ దేశానికి చెందిన 30మంది ఇంజనీర్ల సహకారంతో హైదరాబాద్ ఇంజనీర్లతోపాటు 3వేల మందికి పైగా కూలీలు ఈ ప్రాజెక్టు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో ప్లేగు వ్యాధి వ్యాప్తి చెంది పనులు చేస్తున్న 20ఫ్రెంచ్ ఇంజనీర్లు, 2వేల మందికి పైగా కూలీలు మృత్యువాతపడ్డారు. దీంతో ప్రాజెక్టు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. అయితే వందేళ్లు దాటిన ఇప్పటికి ఇచ్చంపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న నాటి కట్టడాలు చెక్కుచెదరలేదు. గోదావరిలో రాళ్లతో నిర్మించిన తాత్కాలిక రోడ్డు ఇంకా పటిష్ఠంగానే ఉంది. చత్తీస్‌గఢ్ వైపు చేపట్టిన బండ్ ఇంకా బలీయంగా కనిపిస్తుందంటే నాటి ఇంజనీరింగ్ తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

జంపన్నవాగుపై వంతెన ఓ అద్భుతం..

మేడారం జాతరలో 2002కు ముందు జంపన్నవాగుపై ఎలాంటి వంతెనలు లేవు. దీంతో భక్తులు వాగు దాటి జాతరకు వచ్చేవారు. తాత్కాలికంగా పైపుల అమర్చి, వాటిపై ఇసుక బస్తాలను వేసి రోడ్డు వేసేవారు. అయితే 2002లో టీడీపీ హయాంలో అప్పటి కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రూ.1.89కోట్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. అప్పట్లో నక్సలైట్ల నుంచి బెదిరింపులు వచ్చినా తట్టుకుని ఇంజనీర్లు మేడారం అడవుల్లోనే మకాం వేసి 37రోజుల్లో వంతెన నిర్మాణం పూర్తి చేశారు. అతితక్కువ కాలంలో ప్రతికూల పరిస్థితుల్లో ఇంజనీర్లు తమ ప్రతిభ చాటారు. 2014లో మరో వంతెనను ఇంజనీర్ల చాలెంజ్‌గా తీసుకుని దాన్ని కూడా 37రోజుల్లోనే పూర్తి చేసి మొదటి వంతెన రికార్డును సమం చేశారు. మన ఇంజనీర్ల కృషితో నిర్మాణమైన జోడు వంతెనలు మహాజాతరకు వన్నె తెస్తున్నాయి.

నేడు ఇంజనీర్స్ డే

ఏటా సెప్టెంబరు 15న ఇంజనీర్స్ డే జరుపుకొంటారు. తొలి ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్నాటకలోని ముద్దెనహళ్లిలో 1861 సెప్టెంబరు 16న జన్మించారు. మైసూరు దివాన్‌గా 1912 నుంచి 1919 వరకు పని చేశారు. దేశంలో అనేక నదులపై వంతెనలు, ఆనకట్టలను నిర్మించి నీటిపారుదల, తాగునీరు పథకాల ద్వారా జలవనరులను సద్వినియోగానికి కృషిచేసిన ఆయనకు కర్నాటకలోని కృష్ణరాజ సాగర్ ఆనకట్ట నిర్మాణం పేరు తెచ్చింది. ఇక ఆయన హైదరాబాద్ డ్రెయినేజీ వ్యవస్థకు రూపకల్పన చేశారు. విశాఖపట్నం పోర్టు సముద్రం వల్ల కోతకు గురికాకుండా చేయగలిగారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను గౌరవిస్తూ ఏటా ఆయన జయంతి రోజున ఇంజనీర్స్‌డేగా జరుపుకొంటున్నారు.

ప్రపంచంలోనే గొప్ప డిజైన్ కాళేశ్వరం సొంతం

కాళేశ్వరం ప్రాజెక్టు ఓ అద్భుత నిర్మాణం. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తెలంగాణ ఇంజనీర్ల నైపుణ్యం.. మేధస్సు స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో ఉన్న ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టును తెలంగాణ ఇంజనీర్లు రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును రూపొందించారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలో కాళేశ్వరం వద్ద గోదావరిలో కలుస్తున్న ప్రాణహిత నది నీటిని మళ్లించేలా ఈ రీ డిజైన్ జరిగింది. సముద్ర మట్టానికి మేడిగడ్డ 100 మీటర్ల ఎత్తులో ఇది ఉండగా.. ఇక్కడి నుంచి 624మీటర్ల ఎత్తులో ఉన్న కొండపోచమ్మ సాగర్ వరకు నీటిని ఎత్తిపోయాలి. అంటే సుమారుగా ఆర కిలో మీటర్‌కు పైగా ఎత్తుకు నీటిని ఎత్తిపోసేలా కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఇది సాగునీటిరంగంలోనే ఓ గొప్ప ఆవిష్కరణగా నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలు, ఇతర కారణాలపై ఆరోపణలు, విమర్శలు ఉన్నా మన ఇంజనీర్ల పనితీరు మాత్రం అద్భుతమనే చర్చ ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఓ సవాల్‌గా తీసుకున్న ఇంజనీర్లు ప్రాజెక్టు పూర్తి చేయటమే లక్ష్యంగా కుటుంబాలను కూడా వదిలి పనిచేశారు. ఎండ, వాన, చలి, రాత్రి, పగలు అనేది లేకుండా మూడు షిఫ్టుల్లో పనులు చేశారు. ఇంటి వద్ద ఎవరికైనా అనారోగ్యం వచ్చినా 'ఎలాగోలా అడ్జెస్ట్ చేసుకోండి. ఇక్కడ పని బాగా ఉంది. అర్థం చేసుకోండి' అంటూ తమ వారికి సర్దిచెప్పుకొన్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఇంజనీర్లు గుర్తు చేసుకుంటున్నారు. మేధస్సు మాత్రమే కాదు వారి అంకుఠిత దీక్ష కూడా అద్భుతమేనని మన్ననలు అందుకున్నారు.

కాకతీయ ఇంజనీరింగ్ సూపర్...

ఇసుక పునాదులు.. నీటిపై తేలియాడే ఇటుకలు.. భూకంపాలను తట్టుకునేలా శాండ్‌బాక్స్ సాంకేతికతతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. ఇప్పటి ఇంజనీర్లకు కూడా అంతు చిక్కని సాంకేతికత కాకతీయులది. ప్రపంచవ్యాప్త వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణం మహా అద్భుతంగా ఇంజనీర్లు పేర్కొంటారు. ఇసుక పునాదులతో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. శాండ్‌బాక్స్ టెక్నాలజీతో రామప్పతో వెయ్యి స్తంభాల ఆలయాన్ని నిర్మించారు. ఎంత పెద్ద భూకంపాలు వచ్చిన తట్టుకునేలా ఈ శాండ్‌బాక్స్ టెక్నాలజీని అప్పటి ఇంజనీర్లు వినియోగించినట్టు చెబుతారు. అంతే కాకుండా నీళ్లలో తేలియాడే ఇటుకలను కూడా రామప్ప ఆలయ గోపురంపైన వాడారు. ఏనుగు పేడ, తవుడు, కరక్కాయ, చెట్ల జిగురుతో ఇటుకలను తయారు చేసి గోపురం నిర్మాణానికి వినియోగించారు. ఇప్పటికీ నీటిలో తేలియాడే ఇటుకలతో గోపురం చెక్కుచెదరకుండా ఉంది. ఇది అప్పటి కాకతీయ ఇంజనీర్ల సత్తా. అంతేకాకుండా వేలాది గొలుసుకట్టు చెరువుల నిర్మాణం కాకతీయ ఇంజనీర్ల మేదస్సుకు నిదర్శనంగా నిలుస్తాయి. ఓరుగల్లు గడ్డపై ఇంజనీర్ల అమోఘ ప్రతిభను కనబరిచారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

హరికోట్ల రవిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలి

రాంనగర్, సెప్టెంబరు 14: మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్, వరంగల్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన హరికోట్ల రవి అక్రమాలకు పాల్పడ్డారని, విచారణ జరిపి అతడిపై చర్య తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన టీఎస్ఎఫ్, డీఎంఎస్‌పీ నేతలు సుదీర్ఘకాలం వరంగల్‌లో పనిచేసిన రవి అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేసి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, అతడిపై చర్య తీసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నేతలు డి.నరేష్, కె.సునిల్, వంశీకృష్ణ ఉన్నారు.

పేకాట శిబిరంపై దాడి

31వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 14: ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాబా రియల్ ఎస్టేట్ కార్యాలయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేసి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.31వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం ఆరుగురిని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

జీవిత భాగస్వామికో ప్రశంస..

- హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్
- 'ఆమె' శ్రమను గుర్తించేది మాత్రం అతితక్కువ మందేనట
- కొంత సమయం కూడా మాట్లాడని వారెందరోనని అభిప్రాయాలు
- నేడు భార్యను ప్రశంసించే రోజు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భార్య.. భర్తలో సగభాగమే కాదు. ప్రతీ కష్టంలోనూ తోడుండే ఏకైక బంధం. మూడు ముళ్లు పడినప్పటి నుంచి జీవిత చరమాంకం వరకు తోడుగా వచ్చే భార్య భర్త కష్టసుఖాలను అర్థం చేసుకుంటూ కుటుంబ భారాన్ని మోస్తుంది. అలాంటి భార్య శ్రమను గుర్తించే మగవారు మాత్రం అతితక్కువ మందే ఉంటున్నారట. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో అసలు భార్యతో కొంత సమయం కేటాయించి మనసువిప్పి మాట్లాడని వారు ఎందరో ఉన్నారట. అయితే కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుంటూ ఎంతో కష్టపడే భార్య.. తన భర్త నుంచి ఒక్క ప్రశంస వస్తే చాలు అనుకుంటుందట. ఆ ఒక్క ప్రశంసతో తన కష్టాన్నే మరిచిపోతుందట. అందుకే ఏటా సెప్టెంబరు నెలలో వచ్చే మూడో ఆదివారాన్ని భార్యను ప్రశంసించే రోజులుగా జరుపుకొంటున్నారు. వాస్తవానికి ఈ రోజును ఎందుకు, ఎప్పటి నుంచి జరుపుకుంటున్నారో తెలియదు కానీ.. 2006 సెప్టెంబరు మూడో ఆదివారం నుంచి అధికారికంగా అంతర్జాతీయంగా భార్యను ప్రశంసించే రోజు నిర్వహిస్తున్నారు. మన సంస్కృతి సంప్రదాయాల్లో ఇది అంతగా వెలుగులోకి రాలేదు కానీ కొన్ని దేశాల్లో మాత్రం భర్తలు తమ భార్యలతో ప్రత్యేకంగా సమయాన్ని కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది.

లైఫ్‌లో బెటర్ హాఫ్..

మన సంస్కృతి సంప్రదాయాల్లో భార్యకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఆమె లేని జీవితాన్ని ఊహించుకోలేం. ఊహించుకోండి.. నిత్యం ఇంటి పనులే కాదు భర్త, పిల్లల ఆలనాపాలన, కుటుంబ పెద్దల బాగోగులు చూసుకునే క్రమంలో తెల్ల వారింది మొదలు నిద్రపోయే వరకు ఎంతో శ్రమిస్తుంటారు. ప్రస్తుతమైతే మగవారితో సమానంగా ఉద్యోగ, వ్యాపార తదితర బాధ్యతల్లోనూ రాణిస్తున్నారు. ఈ క్రమంలో వారు పడుతున్న శ్రమకు ప్రతిఫలంగా భర్త నుంచి ప్రశంస అందితే చాలని చాలామంది మహిళలు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ విషయంలో భర్త నుంచి ఏమాత్రం ఓదార్పు లేదా ప్రశంస దక్కటం లేదని చాలా మంది ఆవేదన చెందు తుండటం గమనార్హం. పెళ్లి ఎప్పుడైందన్నది కాకుం డా భార్యను ఒక్కసారి మెచ్చుకోగలిగితే.. అంత కన్నా హ్యాపీ వైఫ్.. హ్యాపీ లైఫ్ ఇంకేం ఉండదని, అదే జీవితంలో బెటర్ హాఫ్ అని అభిప్రా యపడుతున్నారు.

- భాగస్వామి తాను పడిన శ్రమను మరిచిపోయేలా ప్రశంసించడమే కాదు వారు ఎంతో ఇష్టపడే బంగారు ఆభరణాలు, చీరలు, ఇతర సౌందర్య సాధనాలను బహుమతిగా ఇవొచ్చు. లేదంటే వంట నుంచి ఈ ఒక్క రోజున విశ్రాంతి ఇచ్చి భర్త ఆమెకు ఇష్టమైన వంటలు చేసి పెట్టొచ్చు. లేదంటే ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లి, తనకు ఇష్టమైన ఆహారాన్ని ఆర్డర్ సర్‌ప్రైజ్ చేయవచ్చు. పువ్వులు, చాక్లెట్లు ఇలా వారికి నచ్చిన వాటితో ట్రీట్ ఇవ్వాలి. ఆమెను పొగుడుతూ ఓ కవితను రాయవచ్చు.

అంతేకాదు సోషల్‌మీడియాను వేదికగా చేసుకుని ఆమెను ప్రశంసించొచ్చు. వైవాహిక జీవితం ప్రారంభ రోజుల నుంచి ఇప్పటి వరకు ఉన్న జ్ఞాపకాలు, ఫొటోలను ఒక పుస్తక రూపంలో తయారు చేసి బహుమతిగా ఇవ్వొచ్చు. రోజంతా వారితోనే పూర్తి సమయం కేటాయించగలిగితే.. ఆ ఒక్క రోజును వారు ఏడాదంతా గుర్తుంచుకుని కుటుంబబాధ్యతల్లో తాము ఎదుర్కొనే కష్టాలను సైతం మరిచిపోగలరని నిపుణులు చెబుతున్నారు.

గని ప్రమాదంపై విచారణ?

పలువురు అధికారులపై చర్యలు!

కాకతీయఖని, సెప్టెంబరు 14: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-8వ గనిలో జరిగిన ప్రమాదంపై సింగరేణి ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. గని అధికారులపై చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. గురువారం మొదటి షిఫ్టులో రవిచందర్ అనే కార్మికుడు పనిచేస్తున్న క్రమంలో అతడికి గాయాలయ్యాయి. రిపోర్టు రాసి ఏరియా సింగరేణి ఆస్పత్రికి తరలించాల్సి ఉండగా ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' శనివారం కథనం ప్రచురితమైంది. దీంతో ఏరియా ఉన్నత అధికారులు విచారణ జరిపి ఎస్‌డీఎల్ ఆపరేటర్‌ను, ఓవర్‌మన్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అలాగే షిఫ్ట్ అండర్ మేనేజర్, ఆపరేషన్ మేనేజర్‌కు మెమో జారీ చేసినట్లు సమాచారం.

సబ్ కలెక్టర్ కార్యాలయానికి సూచిక బోర్డులు

కాటారం, సెప్టెంబరు 14: మండలకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో కాటారం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ కలెక్టర్ కార్యాలయాని కి శనివారం పలు చోట్ల బోర్డులు, సూచికలు ఏర్పాటు చేశారు. అధికారుల ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని కాటారం-మంథని ప్రధాన రహదారి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా జీపీ సిబ్బంది బోర్డులు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ కూడలి నుంచి సుమారు కిలోమీటరున్నర దూరంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఉండటంతో వివిధ పనుల కోసం వెళ్లే ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో కాటారం జీపీ కార్యదర్శి సమీర్‌ఖాన్, కారోబార్ దోమల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గట్టయ్య

కృష్ణకాలనీ (భూపాలపల్లి), సెప్టెంబరు 14: ఈ నెల 16న జరిగే జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు యాదండ్ల గట్టయ్య కోరారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో అమరవీరుల స్తూపం వద్ద ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 11 గంటలకు భూపాలపల్లిలో జనచైతన్య ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి పాల్గొంటారన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట ఉద్యమకారులు జోగుల సమ్మయ్య, బోయిని రాజయ్య, ఎండి.బాబర్‌పాషా, దొంగల రాజేందర్, పున్నం రవి, చికుర్తి దేవేందర్, పోలవేణి అశోక్ యాదవ్, జాగిరి అజయ్, మదన్ మోహన్, సంపత్, శంకర్ తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన

కాటారం, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం పార్టీ సభ్యత్వ నమోదుపై ఐదు మండలాల స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరగ్గా పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరయ్యారు. బీజేపీ పెదపల్లి అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్ చార్జి మోహన్‌రావు, రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు క్యాతం వెంకటరమణ, మచ్చగిరి రాము, పూసాల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ అధికారిని తొలగించండి

మంత్రి సీతక్కకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నేతల వినతి

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 14: ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న జిల్లా సైన్స్ అధికారిని విధుల నుంచి తొలగించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కకు ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర బాధ్యులు చాప బాబు మాట్లాడుతూ జిల్లా సైన్స్ అధికారి ఉపాధ్యాయుడనే విషయాన్ని మరచి దళారి పాత్ర పోషిస్తూ ఉపాధ్యాయుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహించి విద్యార్థుల నుంచి వేల రూపాయలు వసూలు చేయించారని, పరీక్షల నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారి అండతో ఉపాధ్యాయుల అవసరాలను ఆసరా చేసుకుని డబ్బులు గుంజుతున్నారని, ఇలాంటి వ్యక్తి వల్ల జిల్లా విద్యారంగ ప్రతిష్ఠ మసకబారుతోందని అన్నారు. అదేవిధంగా క్వాలిటీ కోఆర్డినేటర్ మల్లారెడ్డి అక్రమ నియా మకాన్ని రద్దుచేసి సీనియర్లకు అవకాశం కల్పించాలని, బదిలీలో, పదోన్నతుల్లో సీనియర్లకు న్యాయం చేయా లని, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పరీక్షల విభాగంలో ఏళ్లతరబడి పనిచేస్తున్న ఉపాధ్యాయులను వారివారి పాఠశా లలకు పంపాలని, సమగ్రశిక్షలో కోఆర్డినేటర్లుగా పనిచే స్తున్న వారి కాలపరిమితి ముగిసిన వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు వాసుదేవరెడ్డి, గన్‌రెడ్డి ఆదిరెడ్డి, హట్కర్ సమ్మయ్య, రేగా నరేంద్రకుమార్, జక్కుల వెంక టస్వామి, మంకిడి రవి, లక్ష్మయ్య, పాపారావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

విఘ్నేశ్వరుడి మండపాల వద్ద సందడి



మల్హర్ మండలం మల్లారంలో వినాయకుడి మండపం వద్ద కుంకుమ పూజల్లో మహిళలు



ములుగులో అన్నదాన కార్యక్రమంలో దాతలు, భక్తులు

మల్హర్, సెప్టెంబరు 14 : వినాయక మండపాల వద్ద సందడి నెలకొంది. మండలంలోని మల్లారం శివపంచాయితన హనుమాన్ టెంపుల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద అర్చకుడు శ్యామ్‌సుందర్ శర్మ ఆధ్వర్యంలో శనివారం కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. తాడిచర్ల గ్రామంలోని వెంకటేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని 11 రకాల పండ్లతో అలంకరించారు.

- మంగపేట: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని మండపాల వద్ద ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రముఖులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు శనివారం అన్నదానాలను నిర్వహిస్తున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంగపేటలోని ఎమ్మార్సీ భవనం, కోమటిపల్లి క్రాస్‌రోడ్డు, కమలాపురం మెయిన్‌రోడ్డు, పాతూరుకాలని, సీపీనగర్, చినబాబునగర్, బోరునర్సాపురం బోడ్రాయి వద్ద, తిమ్మంపేటలోని అంబేద్కర్ సెంటర్ వద్ద అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.
- ములుగు కలెక్టరేట్ : గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామంలో బాలాజీ నర్సింగ్‌హోం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి విగ్రహం వద్ద చిట్టిరెడ్డి ఉమారాంరెడ్డి, మమత షణ్ముఖచారి సహకారంతో మహా అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా డాక్టర్ సబిత-రవిబాబు మాట్లాడుతూ అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని, ప్రతి జీవికి ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి కొన్ని ప్రాథమిక అంశాలు అవసరమని అన్నారు. జీవన నాణ్యతను ప్రభావితం చేస్తున్నప్పటికీ ఆహారం లేకపోతే జీవితమేలేదని, అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపమని పేర్కొన్నారు. నిత్య అన్నదానాలు మోక్షాన్ని పొందడంలో సహాయ పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు జగదపి రాముడు, గూడెపు రాజిరెడ్డి, కక్కిర్ల సాంబయ్య, రణధీర్, సాయిదీప్, ప్రజలు పాల్గొన్నారు.
- మేడారం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. తాడ్వాయి మండలం నార్లాపూర్, మేడారం కాల్వపల్లి గ్రామాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మహాన్నదానాన్ని నిర్వహించారు. గ్రామస్థులు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మండపాలలో ఉన్న విఘ్నేశ్వరుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. బచ్చు సుబ్బరావు, కటుకూరి భాస్కర్‌రెడ్డి, పొడిశెట్టి సర్దార్, చప్పల రాజ్‌కుమార్, నల్లమొక్క రాజశేఖర్, బొమ్మగాని సాయి, సాకర్ల లవన్, యాకూబ్ పాషా, ఎనగంటి రాము, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేశాలయంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్ హాజరయ్యారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గణపతి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు ఎస్సైని శాలువతో సత్కరించారు. అంతేకాకుండా మండలంలోని రామన్నగూడెం గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి, విఘ్నేశ్వరస్వామి ఆలయంలో మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కారం పోషాలు, మాజీ ఎంపీటీసీ అల్లి సుమలత శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ, ఎగ్గడి కోటయ్య, ఆలయ కమిటీ సభ్యులు చిట్టెం ఆదినారాయణ, పళ్ళ మహేష్, పోగుల లక్ష్మీనారాయణ, అలువాల శ్రీనివాస్, పెండ్యాల సంతోష్, తాళ్లపల్లి నరసింహులు, సప్పిడి రాము, గడ్డం మహేష్, కొండాయి చిన్న, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.
- కాటారం: మండలంలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. పలు గ్రామాల్లో కొలువుదీరిన వినాయక మండపాల్లో మహిళలు, భక్తులు శనివారం కుంకుమపూజలు, అన్నప్రసాద వితరణ చేశారు. కొత్తపల్లిలో వినాయక మండపం వద్ద మహిళలు కుంకుమపూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు లోకకల్యాణార్థం అభిషేకాలు చేశారు. పలువురు దాతలు భక్తులు, పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాల్లో వేదపండితులు, కుల సంఘాల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



అశోక్ (ఫైల్)

రేగొండ, సెప్టెంబరు 14: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లిలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బొమ్మ అశోక్ (40) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం ఇంటి పనుల్లో ఉండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విద్యుత్ తీగ డ్యామేజ్ అయ్యుండి ఇంటి పైకప్పు ఇనుప రేకులకు తాకడంతో కరెంటు సరఫరా అయ్యింది. రేకులకు ఇనుప తీగ కట్టి ఉండగా దానిపై బట్టలు ఆరేయడానికి అశోక్ ప్రయత్నించాడు. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా సతీష్

గోవిందరావుపేట, సెప్టెంబరు 14: భారతీయ జనతా పార్టీ మండల నూతన కన్వీనర్‌గా మార్క సతీష్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. మండలంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడతానని, తన నియామకానికి సహకరించిన జిల్లా, మండల నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కస్తూర్బా పాఠశాల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ఏటూరునాగారం, సెప్టెంబరు 14: కస్తూర్బా గాంధీ పాఠశాల, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ములుగు జిల్లా కమిటీ సభ్యుడు సోడి అశోక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎస్‌ఎఫ్‌ఐ సమావేశంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఏటూరునాగారంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫ్యాన్లు, సరైన ఫర్నిచర్, పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో రాక సతమతమవుతున్నారని తెలిపారు. ఇక్కడ మూత్రశాలలు, మ రుగుదొడ్లు పూర్తిస్థాయిలో లేవన్నారు అధికారులు స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వంశీ, మల్లికార్జున్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి

తాడ్వాయి, సెప్టెంబరు 14: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 17వతేదీ వరకు గ్రామగ్రామాన విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ కోరారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు స్వాతంత్ర్యం కేవలం కమ్యూనిస్టు ద్వారానే వచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై పోరాటాలను ఉధృతం చేయాలని అన్నారు. ఈసమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి బండారి శ్రీనివాస్, నాయకులు ఈసం నాగేశ్వర్‌రావు, వట్టం రాంబాబు, ఇర్ప నర్సింగరావు, లక్ష్మయ్య, సమ్మయ్య, ప్రసాద్, నర్సింగరావు, సుధీర్, అఖిల్, ప్రకాశ్, రవి, నర్సయ్య, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చిట్యాల, సెప్టెంబరు 14: మండలంలోని కాల్వపల్లి శివారు మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను జడల్‌పేట గ్రామంలో పట్టుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహించి అనుమతుల్లే కుండా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించామన్నారు. వాహనాల డ్రైవర్లు, యాజమానులు ఇందారపు కొమురయ్య, మోరె సుశాంక్, కొత్తూరి శేఖర్, గొర్రె చంద్రయ్య, కన్నూరి నరేష్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. వాహన తనిఖీలో ఏఎస్సై సమ్మిరెడ్డి, కానిస్టేబుళ్లు నవీన్, అస్లాం, లింగన్న, మమత తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ఓనం పండుగ



అయ్యప్పస్వామికి జలాభిషేకం చేస్తున్న కమిటీ సభ్యులు

గోవిందరావుపేట, సెప్టెంబరు 14: గోవిందరావుపేట గ్రామంలోని శ్రీహరిహర క్షేత్రం అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పీఎంకే గాంధీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ఓనం పండుగ జరిగింది. ఈసందర్భంగా స్వామిని వాగులో జలాభిషేకం చేసిన అనంతరం ట్రాక్టర్‌లో జాతీయ రహదారిపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని అభిషేకం నిర్వహించి పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జంపాల సత్యనారాయణ, జట్టు శోభన్, నర్ర శివాజీ, కస్తూరి రామకృష్ణ, లావుడ్యా జోగా, జెట్టి రాజు, పెందుర్తి శివాజీ, భూపతి సదానందం, శివ, పప్పీ, మాచినేని రాధాకృష్ణ, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'రైతుల సమస్యలు పట్టించుకోని సర్కారు'

కాటారం, సెప్టెంబరు 14: రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్ విమర్శించారు. మండలకేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. సాగు ముగిసే దశకు వచ్చినా రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వలేదని, రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర రుణాలు తీసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే రైతు భరోసా మేనిఫెస్టోలో చెప్పినట్లు రూ.2లక్షల రుణమాఫీ ఏ షరతులు లేకుండా అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పూర వెంకటేశ్వర్‌రావు, ఉప్పు సంతోష్, జక్కు శ్రావణ్, కిరణ్, రవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరుపుకోవాలి

మొగుళ్లపల్లి, సెప్టెంబరు 14: వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై బి.అశోక్ ఉత్సవ కమిటీలకు సూచించారు. ఈమేరకు శనివారం ఆయన మండలంలోని వాగులు, చెరువులు, కుంటలను పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. మండలంలోని గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని అన్నారు. డీజేలకు ఎలాంటి అనుమతిలేదని, మద్యం సేవించడం, ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

కాటారం, సెప్టెంబరు 14:మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కొత్తపల్లి, శంకరంపల్లి, నస్తూరుపల్లి జీపీల పరిధిలో బోగిరి ప్రవళిక, కోట రాజయ్య, మెరిజాల వెంకటయ్య, కందికొండ వైష్ణవి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మధు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనారోగ్యంతో బాధపడు తున్న పాగె మల్లయ్య, పోత శ్రావణ్‌ను పరామర్శించి ఆరోగ్యపరిస్థితి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పూర వెంకటేశ్వర్‌రావు, గాలి సదువలి, నాయకులు సంతోష్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

అధికారులతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



వాజేడులో వరదలకు దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

వాజేడు, సెప్టెంబరు 14: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో పనిచేయాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. మండల కేంద్రంలో వాజేడులో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గోదావరి వరదల వల్ల కొంత మేర నష్టం వాటిల్లిందన్నారు. నియోజకవర్గంలో ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రోడ్లు ధ్వంసమయ్యాయని తెలిపారు. ఇప్పటికే వరదలపై నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు కలెక్టరు, డీఎంహెచ్‌వోతో మాట్లాడుతున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించినట్లు తెలిపారు. జీపీ అధికారులు, వైద్యసిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అత్యవసర పనులకు రూ.5 కోట్లు కేటాయించదని, ఆ నిధుల నుంచి పలు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇటీవల యూరప్‌లోని మాల్టా దేశంలో ఇప్పగూడేనికి చెందిన మొడెం వంశీ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తరుణంలో అతడికి సరైన గుర్తింపు దక్కేలా కృషి చేస్తానన్నారు. కామన్‌వెల్త్ గేమ్స్‌లో ఆడించేలా ప్రోత్సహిస్తామన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాల్లో సుమారు 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా పేదలకు వైద్యం అందించటంలో ఎలాటి నిర్లక్ష్యం చేయొద్దని, వైద్యశాలలో నిత్యం అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులను అరికట్టాలని అన్నారు. అనంతరం ఆయన ఇటీవల వరదలకు దెబ్బతిన్న వాజేడు-గు మ్మడిదొడ్డి ప్రధాన రహదారిని పరిశీలించారు. దెబ్బతిన్న చోటు వెట్‌మిక్స్‌ను పోయించాలని ఆర్‌అండ్‌బీ డీఈని ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం వాజేడు వైద్యశాలను సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్యంపై రోగులను ఆరా తీశారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ వర్మ, సీనియర్ నాయకులు ప్రసాదబాబు రాజు, జగన్నాథరాజు, నాయకులు వాసు, కాళికృష్ణ, ధనిశెట్టి రాంబాబు, బొల్లె వెంకటేశ్వర్లు, చంటిబాబురాజు, దుర్గారావు, ఖాజావలీ తదితరులు ఉన్నారు.

పదలో అండగా సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 14: ఆపదలో సీఎం సహాయనిధి ప్రజలకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి రూ. 18.98లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. భూపాలపల్లిలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. అపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి సీఎం సహాయనిధి వెంటనే అందిస్తున్నామని తెలిపారు. పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు.

క్యాంపు కార్యాలయంలో మహా అన్నదానం..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపతి నవరాత్రోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే తన చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగిది. కాంగ్రెస్ నాయకులు బుర్ర కొమరయ్య, ఇస్లావత్ దేవన్, క్యాతరాజు సాంబమూర్తి, రంజిత్, శ్రీనివాస్, పైడిపల్లి రమేష్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

పరామర్శ

చిట్యాల : మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెల్దె నాగేశ్వర్‌రావు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, మాజీ జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కామిడి రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ చెన్న చందర్, చిలుకల రాయకొమ్ము, దబ్బెట అనీల్, వెంకన్న తదితరులు ఉన్నారు.

కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

మహదేవపూర్, సెప్టెంబరు 14: కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థాన చైర్మన్‌గా గూడాల కృష్ణమూర్తి అందించిన సేవలు చిరస్మరణీయమని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కొనియాడారు. గూడాల కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందగా మండల కేంద్రంలో అయన నివాసంలో కుటుంబసభ్యులను ఎంపీ శనివారం పరామర్శించారు. కృష్ణమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రాంతానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధయక్షులు కోట రాజబాబు, గూడాల శ్రీనివాస్, వామన్‌రావు, వరప్రసాద్, అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

మంగపేట, సెప్టెంబరు 14: మండలంలో మలేరియా, విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కు మార్ వైద్యులకు సూచించారు. మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ పరిధిలోని అకినేపల్లి-మ ల్లారం, ఎస్టీకాలనీ, చుంచుపల్లి పీహెచ్‌సీ పరి ధిలోని వాడగూడెం, పాలాయి గూడెం, రమ ణక్కపేట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ఆయన శనివారం పరిశీలించారు. శిబిరాంలో అందిస్తున్న వైద్య సేవల గురించి వైద్యాధికారులు యమున, నాగవినేష్‌ను అడిగి తెలుసుకున్నారు. వారం రోజులుగా జిల్లాలో 174 గ్రామ పంచాయతీల పరిధి 502 ఆవా సాల్లో వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలి పారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తేనే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆయన వెంట వైద్యాధికారి నిఖిల్‌కుమార్, అన్వేష్, సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలని గ్రామస్థుల రాస్తారోకో

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబరు 14: మండలకేంద్రం నుంచి ఎదిర వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలోని శివాలయం సెంటర్‌లో గ్రామస్థులు శనివారం బైఠాయించి రెండుగంటలపాటు రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి ఎదిర వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను ప్రారంభించి ఏడాది కావస్తున్నా కాంట్రాక్టర్ నేటివరకు పనులు పూర్తి చేయలేదని అన్నారు. రోడ్డుపై కంకర పోసి వదిలివేయడంతో వాహనాల రాకపోలకు ఇబ్బంది కలుగుతుందని, పలువురు వాహన దారులు రోడ్డు ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌చే రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, లేనట్లయితే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.



రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

తాడిచర్ల ఓసీపీలో స్వచ్ఛత పక్షోత్సవాలు

మల్హర్, సెప్టెంబరు 14 : మండల కేంద్రమైన తాడిచర్లలోని ఓసీపీలో శనివారం స్వచ్ఛత పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 15 రోజులపాటు వివిధ అంశాల్లో కార్యక్రమాలు జరగనున్నాయి. కోల్ కంట్రోలర్ అధికారి సుబ్రహ్మణ్యం, ఏజెంట్ బాలరాజు, జీఎం మోహన్‌రావు సూచనలతో గని అధికారులు ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస్, సురేష్‌బాబు, విశ్వప్రసాద్, రవికుమార్‌తో పాటు సూపర్‌వైజర్లు, కార్మికులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు మైన్‌లో ఈ పక్షోత్సవాలు జరగనున్నాయి.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

గోవిందరావుపేట, సెప్టెంబరు 14: మండలంలోని ప్రాజెక్ట్‌నగర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సమకూర్చిన రూ.15 వేలనుఅందజేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి తదితరులు పాల్గొన్నారు.